"అయ్యగారు తలుచుకుంటే అబ్బాయిగారికి క్షణంలో ఉద్యోగం దొరుకుతుంది" అంటూ ఉంటాడు జవాన్ వెంకడు.

అమ్మగారు కాస్త ఉల్లాసంగా కనిపిస్తే చాలు, వాడు సలహాలు చెబుతాడు; హితబోధ చేస్తాడు.

అయ్యగారు "వూఁ"అంటే చాలు, ఇంట్లో వేలు కురుస్తాయి. ఫోన్ ఎత్తితే చాలు అబ్బాయి గారికి ఉద్యోగం వస్తుంది—ఇవీ వాడి మాటలు!

రాఘవేంద్ర సత్యకాలం మనిషి. తాను న్యాయంగా వ్యవహరిస్తున్నాడు కాబట్టి దేవుడు చల్లగా చూస్తాడు. శ్రీన్ కి న్యాయంగానే తగిన ఉద్యోగం లభిస్తుంది. అందుకే అవకాశం ఉన్నా గట్టిగా పూనుకోలేదు.

శ్రీన్ రెండు, మూడు ఇంటర్వ్యూలకు వెళ్ళి శూన్య హస్తాలతో తిరిగి వచ్చినా, అతని విశ్వాసం సడలలేదు.

అలా కాకూడదు అనుకునే కొద్దీ అలాగే జరిగి ఉంటుంది అనిపిస్తూంది.


మూర్తికి కూడా వివరాలు పూర్తిగా తెలియవు.

హైదరాబాదులో ఏదో ఆఫీసు ఇంటర్వ్యూలో తమకు అన్యాయం జరిగిందని భావించిన అభ్యర్థులు ఆఫీసర్ని కొట్టి, ఫర్నిచర్ నాశనం చేశారట—నాలు గయిదు రోజుల క్రితం.

తుమ్మెద తుమ్మితే చాలు, ఎంతో ఆర్భాటంగా ప్రచురించే ఏ దినపత్రికలోనూ ఈ వార్త రాలేదు. ఎందుకు?

ఈ వార్త నిజం కాదేమో? శ్రీన్ ఇలాంటి గొడవల్లో తల దూర్చడు. కాని, గొడవ జరిగే ఉంటుంది. పోలీసులు వచ్చి ఉంటారు. అరెస్టులు జరిగి ఉంటాయి. విషయం పొక్కకుండా జాగ్రత్త పడి ఉంటారు.

హైదరాబాదుకు ట్రంక్ కాల్ చేస్తే?



"ఇది కాకపోతే మరొకటి!" అని కొడుక్కి ధైర్యం చెప్పేవాడు. ఈసారి తప్పక శ్రీన్ సెలెక్టు అవుతాడని అతని అంతరాత్మ నొక్కి చెబుతూంది.

కాని, హైదరాబాదు నుండి శ్రీన్ రాలేదు. ఉత్తరమూ లేదు. రోజులు గడుస్తున్న కొద్దీ రాఘవేంద్ర నమ్మకం సడలిపోతున్నది. మనసు పరిపరి విధాల పోతున్నది. కీడు శంకిస్తున్నది.

నిన్న ఆఫీసులో మూర్తి చెప్పిన విషయం నిజమే నేమో?

ఆ విషయం మరిచిపోవడానికే ఈ వేళ సెలవు పెట్టి ఇంట్లో కూర్చున్నాడు. పుస్తకాలు సర్దుతున్నాడు. పాత ఉత్తరాలు చదువుకొన్నాడు. భార్య మీద విసుక్కున్నాడు.

ఇన్ని చేసినా ఆ విషయం మళ్ళా మళ్ళా జ్ఞాపకం వస్తూంది.

గటుక్కున లేచా డాయన.

"పోస్ట్!"

గుమ్మంలో పడిన కవరు చూసి, 'అమ్మయ్య!' అని నిట్టూర్చాడు. అది శ్రీన్ నుండే. కవరు బరువుగానే ఉంది. ఏమిటో విశేషం? కామాక్షమ్మ వంట గదిలో ఉంది కాబోలు—ఆత్రంగా విప్పాడు.

"నాన్నగారూ!

న న్నెందు కిలా పెంచారు, నాన్నగారూ?"

ఉలిక్కిపడ్డా డాయన. గది లోపలికి పోయి స్థిమితంగా కూర్చుని చదవటం మొదలు పెట్టాడు.

"నన్నెందుకిలా పెంచారు, నాన్నగారూ? కాలేజీ నుండి బయటికి వచ్చి ఉద్యోగాన్వేషణలో తిరిగిన ఈ

ప్రఫుల్లచంద్ర

రెండు నెలల్లోనూ నేను ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను.

కాలేజీ నన్ను మోసం చేసింది. మీరూ చేశారు.

కాలేజీలో చెప్పిన విషయాలకూ, లోకం పోకడకూ పొంతన లేదు. మీరు నాలో పెంచిన మంచికి ఈ లోకంలో పరిగణన లేదు. తెలివి తేటలకు గుర్తింపు లేదు. ఇంటర్వ్యూలో అభ్యర్థికి కావలసింది సమర్థత కాదు!

అవినీతి! డబ్బు!

ఈ రెండు చక్రాల మీదనే ప్రపంచ రథం మహా జోరుగా సాగిపోతూంది! నీతిగా పోయేవాడు అసమర్థుడు!

ఈ విషయాలు మీకు తెలియవా, నాన్నగారూ? తెలిస్తే మరి నన్నెందు కిలా పెంచారు?

ఆ రోజు—

ఇంటర్వ్యూ కోసం వచ్చిన మేము ఆరుగురం ఒకే లాడ్జిలో దిగాం. స్నానాలు చేసి, టిఫిన్ తిని, ఇంకో రెండు గంటల్లో జరగబోయే ఇంటర్వ్యూ కోసం హడావుడిగా జనరల్ నాలెడ్జి పుస్తకాలు తిరగ వేస్తున్నాం. ప్రశ్న లడిగి జవాబులు చెప్పుకుంటున్నాం.

ఇంతలోగా తలుపు తోసుకొని ఒక గొట్టాంగాడు లోపలికి వచ్చాడు. 'ఫలానా ఆఫీసులో హింటర్వ్యూకి గదా మీ రొచ్చారు? హింటర్వ్యూ చేసే అధికారి నాకు తెలుసు' అన్నాడు ఏదో రహస్యం చెబుతున్నట్టు.

అతడు చెప్పిందేమంటే, పదివేలు ఎవరిస్తే వారికి ఉద్యోగం ఖాయం అట.

'దీనిలో మోసం ఏమీ లేదు' అని నమ్మబలికాడు.

'అది అన్యాయం కాదా?' అని అడిగాను.

'ఓరి వెర్రివాడా!' అన్నట్టు చూసి నవ్వాడు. 'దేవుడికే లంచం పెట్టే దేశం మనది! లంచం అన్యాయం కాదు. లంచం ఇచ్చినా పని జరగకపోతే అదీ అన్యాయం!' తత్త్వం బోధించాడు.

'అవినీతిని ప్రోత్సహించ కూడదు!' అన్నాను.

గొల్లున నవ్వాడు. 'మన దేశం నిండా దుర్గాలి వీస్తోంది గురూగారూ! మనం ఒకళ్ళమే సెంటు పూసుకుంటే గాలి బాగుపడదు! అవినీతి ఎక్కడ లేదు? మీరు కాపీ చేయకుండానే పరీక్షలు పాస్ అయారా? మీరు కాపీ అందివ్వక పోతే మీ స్నేహితులు పాస్ అయ్యేవారా? కఠినంగా ఉండే మాచర్ని తన్నలేదా మీరు? సినిమా టికట్లు అయిపోతే బ్లాక్‌లో కొనడం లేదా? క్యూ పెద్దదిగా ఉంటే మధ్యలో దూరడం లేదా? మీరు క్యూలో ఉండగా మీ స్నేహితుడు వస్తే అతనికి చోటు ఇవ్వడంలేదా? రైలు ప్రయాణాల్లో ఎవరి చేతులూ తడపకుండానే సీట్లు సంపాదించారా? అందువల్ల అవినీతి అనే మాటను ఒదిలేయండి గురూగారూ! తినగ తినగ వేము తియనుండు అన్నట్లు — చూడగా చూడగా అవినీతి — నీతిగుండు!' అని ఉపన్యాసమే ఇచ్చాడు.

అంతా బోగస్ అనుకొని వాణ్ణి పొమ్మన్నాం.

ఇంటర్వ్యూలో మే మందరం బాగానే చేశాం.

ఎవరు సెలెక్టు అవుతారో తేలేవరకూ ఇళ్ళకు వెళ్ళకూడ దనుకున్నాం. మాలో ఎవరమూ సెలెక్టు కాలేదని మరునాడే తెలిసింది. ఆరా తీస్తే, సెలెక్టు అయిన పెద్ద మనిషి ఉద్యోగాన్ని పదివేలకు కొనుక్కున్నాడని తెలిసింది.

మా రక్తం మరిగింది. లాడ్జికి వచ్చి వాదించుకున్నాం. ఏం చేయాలి?

న్యాయంగా అయితే మాలో ఒకరికి రావలసిన ఉద్యోగం. మాలో ఎవరికి వచ్చినా మిగిలిన వాళ్ళకు బాధలేదు. కానీ, ఎవడో అనామకుడు! మా కంటే మార్కులు తక్కువ వచ్చిన వాడు! ఏ విషయంలోనూ మాకంటే అధికుడు కాని వాడు! వాడికి ఉద్యోగమా?

'ఈ ఆఫీసే కాదు, అన్ని ఆఫీసుల చరిత్రా ఇంతే!' విరాళగా అన్నాడు మాలో పాతిక ఇంటర్వ్యూల సీనియర్!

కొన్ని నెలల్లో అతని తండ్రి రిటైర్ అవుతాడు. ఆలోగా తనకు ఉద్యోగం దొరకకపోతే ఎదురయ్యే సమస్యలు చెప్పుకొని బావురుమన్నాడు.

మా అందరిదీ ఒకే ప్రశ్న—ఈ అన్యాయం ఇలా సాగుతూ ఉండవలసిందేనా?

మాలో రఘువీర్ తీవ్రవాది. 'ఈ అన్యాయాన్ని అరికట్టాలి. ఇప్పుడే! ఇక్కడే! మనమే!' అన్నాడు తీవ్రంగా.

అతని ఆవేశం మాకు నచ్చింది. ఆలోచించాం. పథకం తయారుచేశాం. అవినీతి నిరోధక శాఖాధికారిని కలుసుకొని అంతా చెప్పాం. తప్పక సహకరిస్తానన్నాడు. కొంత హడావుడి చేశాడు.

ఏమీ తెలియనట్టు మరునాడు మళ్ళా ఆఫీసుకు వెళ్ళాం. గొట్టాంగాడు ఆ ఆఫీసులోనే పని చేస్తున్నాడు. పేరు చుంచులు! మమ్మల్ని చూసి నవ్వాడు. 'హోరి అమాయకులారా!' అన్నట్టుంది ఆ నవ్వు.

వాణ్ణి మంచి మాటలతో బుట్టలో పెట్టి, కాఫీ పోయించి అసలు విషయం లాగాం.

'అవినీతి పాకవాలన్నా మనుసులే! ప్రసాదంలో వాటా పెట్టేసరికి కళ్ళు కద్దుకొని వెళ్ళిపోయారు' అన్నాడు గొట్టాంగాడు నవ్వుతూ. వాడు అంతటితో వెళ్ళిపోయినా బాగుండేది.

'డిగ్రీలు సంపాదించారు గాని మీకు బుర్రల్లేవు, గురూ! అదృష్టం తలుపులు తట్టినప్పుడు కాదు పొమ్మన్నారు. ఇప్పుడు ఏడవండి!' అన్నాడు.

మా రక్తం మరిగిపోయింది. నవ్వుల పాలు అయినందుకు కసి రేగింది.

ప్రతీకారం చేయాలి. చేయాలి. ఎలా?

హటాత్తుగా ఏదో నిర్ణయానికి వచ్చాడు కాబోలు—రఘువీర్ గొట్టాంగాడి కాలర్ దొరక బుచ్చుకున్నాడు. బరబర ఈడ్చుకుంటూ వడివడిగా నడిచాడు. గొట్టాంగాడు గిజగిజలాడుతున్నాడు. కుయ్యో మంటున్నాడు. మిగిలిన గుమాస్తాలంతా దిగ్భ్రాంతిగా చూస్తూ పూరుకున్నారు. ఆఫీసర్ గదిలోకి దూసుకుపోయాం.

ప్రళయకాల రుద్రుడులా భయంకరంగా కనిపిస్తున్నాడు రఘు. కళ్ళలో కసి! గుండెలో మంట! అన్యాయాన్ని కాల్చి మసి చేసే మంట! ఈడ్చుకు వచ్చిన గొట్టాంగాణ్ణి ఒక్క తన్ను తన్నాడు. వాడు వెళ్ళి ఆఫీసర్ కాళ్ళ మీద పడ్డాడు.

రఘు నోట వాగ్ధారలా మాటలు తోసుకు వస్తున్నాయి. 'దేశాన్ని కొల్లగొడుతున్న కుక్కల్లారా! నక్కల్లారా! గాది కింద పందికొక్కుల్లారా! మీ పెళ్ళాల మాంగల్యాల గట్టితనానికి పరీక్ష వచ్చిందిరా!...' ఇంకా ఏదో అంటున్నాడు.

ఆఫీసర్ వణికిపోతున్నాడు. గొట్టాంగాడు మూల నక్కాడు. గుమాస్తాలు బొమ్మలే అయ్యారు. ఏం చేయాలో ఎవరికీ తెలియదు. ఆ దృశ్యం ఇంకా నా మనస్సులో మెదులుతూనే ఉంది.

రఘుని చూడండి. చూడండి, నాన్నా!

ఆవేశమా అది? ప్రళయ ఝంఝామారుతంగాని!

మాటలా అవి? వాగ్బాణాలుగాని!

కన్నీళ్ళా అవి? కాల్చివేసే విస్ఫులింగాలు గాని!

అతని ఆగ్రహం మాకే భీతి కలిగించింది. పరిహరిలా ఆఫీసర్ మీదకు లంఘించాడు. అతని పై గుంజాడు. పేపర్ వెయిట్‌తో అతని తల మీద రామకీర్తన మోగించాడు. పొట్ట చీల్చి పేగులతో రుద్రవీణ పలికించే వాడే. కాని, ఆగాడు.

ఈలోగా మేం గాజు తలుపులు విరిచివేశాం. కుర్చీలు విసిరి వేశాం. ఫైళ్ళు చింపేశాం. ఉద్యోగం కొనుక్కున్న బడుద్ధాయి డిగ్రీ, సర్టిఫికేట్లూ టేబుల్ మీదనే ఉన్నాయి. చింపేశాం.

ఇదంతా కేవలం అయిదే అయిదు నిమిషాల్లో జరిగిపోయింది.

ఆరవ నిమిషంలో మేం రోడ్డు మీద ఉన్నాం...

ఇప్పు డేమిటి? ఎంతమందిని ఇలా మరమ్మత్తు చేయగలం?

పెద్ద ప్రశ్న. గడ్డు సమస్య.

ఎవరి దారిని వాళ్ళు వూళ్ళకు వెళ్ళిపోయారు. నేనూ, రఘూ మిగిలాం. లాడ్జి ఖాళీ చేసేశాం.

ఆఫీసర్ పోలీసు రిపోర్టు ఇచ్చి ఉంటాడా? ఇస్తే వాళ్ళు మమ్మల్ని పట్టుకోవచ్చు. పట్టుకొని కోర్టులో హాజరు పరిస్తే మీకు వ్రాసిన ఈ విషయాలే కోర్టులోనూ చెబుతాం.

అందువల్ల ఆఫీసర్ పోలీస్ రిపోర్టు ఇవ్వడు. ఇచ్చే ధైర్యం ఉండదు. ఆ మధ్య సచివాలయంలో జరిగిన కాల్పుల్లో ఒకరు చచ్చిపోతే సాక్ష్యం చెప్పడానికి ఎవరూ రాలేదని ఒక న్యాయమూర్తి ఆవేదన వెలిబుచ్చారు.

అందువల్ల తేలిం దేమిటి?

నీతికి వెన్నెముక లేదు! ఉన్నా, నిర్భయంగా, నిటారుగా నిలబడడానికి బలం చాలదు!

కనక మాకు వ్యతిరేకంగా సాక్ష్యం ఉండదు.



మిస్టర్ బ్యూటీ పేర్లర్, హైదరాబాదుకు చెందిన శ్రీమతి హూరన్ అబ్బాస్ యిలా అంటున్నారు.

"గ్లీమ్ షాంపూతో యిక ఏ రకమైన జుట్టును గురించైనా నేను అవస్థ పడనక్కర్లేదు! మీ తరహా జుట్టు కోసమే ప్రత్యేకంగా రూపొందించబడిన రకం ఒకటి ఉంది!"

ప్రతీ గ్లీమ్ షాంపూ దానిలోని ప్రత్యేక పదార్థాల మూలంగానూ, పుష్కలమైన నురగమూలంగానూ పూర్తి ఫలితాలను ఇస్తుంది. మీ జుత్తు ఏ రకానికి చెందినది అయినా, గ్లీమ్ మూలంగా దానికో కొత్త అందం సమకూరుతుంది. దాని ఫ్రెంచి సుగంధం మిమ్ము అంటి పెట్టుకునే వుంటుంది—ఎంతో పొదుపు కూడా.

| గ్లీమ్ రెగ్యులర్ | గ్లీమ్ ఎగ్ | గ్లీమ్ టానిక్ |
| --- | --- | --- |






ఇప్పుడు వీలైన 60 మి.లీ. సైజులో కూడా

G-50

గ్లీమ్ షాంపూ

ప్రఖ్యాత హెయిర్ డ్రెసర్ల మెప్పు పొందినది.

Geoffrey Manners & Co. Ltd.

అయినా ఆఫీసర్ పోలీస్ రిపోర్టు ఇచ్చినప్పుడు కదా? ఉద్యోగం లేకుండా ఇంటికి రాలేను.

మొబైల్ లాండ్రీ, టైప్ ఇన్స్టిట్యూట్‌లాంటివి పడానికైనా సిద్ధపడి, అప్పులకోసం జాతీయ బాంకులకు వెళితే తీర్చక పోయినా ఇబ్బందిలేని, పెట్టి పుట్టిన అదృష్టవంతులు కొంతమందికే ప్రజల డబ్బు అప్పుగా ఇస్తారని తెలిసింది. ఖచ్చితంగా తీర్చే నాలాంటి వాళ్ళ కివ్వరట!

తల తిరిగింది. ఇప్పు డేమిటి చేయడం?

హైదరాబాద్ నుండి ఈ వూరు (పేరు చెప్పను) వచ్చాం. రఘు కొంతమంది తీవ్రవాదుల్ని పరిచయం చేశాడు.

వాళ్ళ దౌర్జన్య వాదం నా కిష్టం లేకపోయినా, న్యాయంకోసం వారి ఆరాటం, సంఘాన్ని మరమ్మత్తు చేయడానికి వాళ్ళు పడుతున్న తపన, చేస్తున్న త్యాగాలు నన్ను వూపివేస్తున్నాయి. జీవంతో ఉన్న మనుషులు వాళ్ళు. వాళ్ళను చూస్తూంటే నేను స్వార్థపరుడినేమో ననిపిస్తూంది. ఒక బాధ్యత గల యువకుడుగా, సమాజపు రుగ్మతలను కొంత వరకైనా క్షాళనం చేయాలనిపిస్తూంది. వాళ్ళతో చేరాలనిపిస్తూంది.

కాని, వారి హింసాత్మక ధోరణి నాకు నచ్చదు.

మీరు చూపిన మార్గం, కాలేజీలో బోధించిన మార్గం—ఈ మెయిన్ రోడ్డు. కానీ, ఈ రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. అందరూ అడ్డదారులగుండా పరుగెత్తుతున్నారు. కొందరు గమ్యస్థానాలను చేరుకుంటున్నారు.

నేను నడిరోడ్డు మీద నిలబడి ఆలోచిస్తున్నా.

ఏది దిక్కు? ఎటు వెళ్ళాలి?

మీరు నాలో పెంచిన సంస్కారం నన్ను అడ్డదారి తొక్కనీయడం లేదు. మరి, నిర్మానుష్యంగా ఉన్న రాచబాట వెంబడి ఎంతదూరం ప్రయాణం చేస్తే నేను గమ్యాన్ని చేరుకుంటాను? అసలు చేరుకోగలనా? గమ్యాన్ని చేర్చని మార్గం ఎందుకు? నన్నెందు కిలా పెంచారు, నాన్నగారూ?

కర్తవ్యతా విమూఢుడను. నాకు సలహా కావాలి. మార్గదర్శకుడు కావాలి. నాకే కాదు, నాలా దిక్కు తోచక అలమటిస్తూ దౌర్జన్యవాదం వైపు మొగ్గుతున్న యువతరాన్ని ఉత్తేజపరిచి, సమాజ కల్యాణం కోసం నిర్మాణాత్మక పంథాలో నడిపించే నాయకుడు కావాలి. అందుకే వూరూరా వెదుకుతున్నా. నా కోరిక నెరవేరి, సమాజ ప్రక్షాళనలో నా వంతు బాధ్యతలో అవగింజంత అయినా నెరవేర్చిన తరవాత సగర్వంగా మీ ప్రేమాభిమానాలను పంచుకోవడానికి వస్తాను. అంతవరకూ సెలవ్!

—మీ శ్రీన్."

* * *

"ఏమండీ! అలా ఉన్నా రేమిటి? అబ్బాయి నుండి ఉత్తరం గాని వచ్చిందా?" భర్తను కుదుపుతూ అడుగుతున్నది కామాక్షమ్మ.

ఉత్తరం చదివి, స్తిమితం కోల్పోయి శూన్యం లోకి చూస్తూ ఉండిపోయిన రాఘవేంద్ర తల తిప్పి వెర్రిగా భార్యవైపు చూశాడు.

ఆ చూపులో వెలుగు లేదు.

"ఏమయిందండీ?" కంగారుగా అడిగింది.

"షార్ట్ సర్క్యూట్!" జీవం లేని స్వరం!

హార్ట్ ఎటాక్‌లా వినిపించింది కాబోలు— ఏడుపు మొదలు పెట్టింది ఆమె.

"షార్ట్ సర్క్యూట్ ... అడ్డదారి ..." పిచ్చివాడిలా గొణుక్కున్నాడు.

ఆమె సహించలేక పోయింది. భర్తను కుదుపుతూ, "సరిగా చెప్పండీ" అంది ఏడుపు దిగమింగి.

"షార్ట్ సర్క్యూట్ అంటే ... అడ్డదారి. కరెంట్ తిన్నగా వెళితే బల్బు వెలుగుతుంది. అడ్డదారిని వెళితే ఇల్లు కాలిపోతుంది." పిచ్చిగా అన్నాడు.

అయితే హార్ట్ ఎటాక్ కాదన్న మాట! రిలీఫ్‌గా నిట్టూర్చింది ఆమె.

మరి భర్త ఎందు కలా ఉన్నాడో అర్థం కాలే దామెకు.


"ఏదీ సరిగా చెప్పరు కదా? ఇప్పు డెవరి ఇల్లు కాలిపోయిందండీ?" అడిగింది అసహనంగా.

భార్య మొగం వైపు చూచాడు. జీవం లేని చూపు! స్థిరం లేని చూపు!

"ఈ అడ్డదారుల వల్ల భారత మాత ఇల్లు కాలిపోతున్నది!" అన్నాడు కలగంటూ మాట్లాడుతున్నట్టు.

"భారత మాతగారు ఎవరండీ?"

అతడు వెర్రిగా ఆమె ముఖంలోకి చూస్తూ పూరుకున్నాడు. *




ఆంధ్రప్రదేశ్‌కు డీలరు భోగట్టాలు : మెస్సర్స్ ఎ. ఎలెక్ట్రాన్ ఎంటర్ ప్రైజెస్, 11-31-37/2, పార్కు రోడ్డు, సామరంగం చౌక్ దగ్గర, విజయవాడ-520 001.